
# నమస్తే తెలంగాణ
## భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, మంగళవారం 10 జూన్ 2025 | BHADRADRI KOTHAGUDEM




మణుగూరు టౌన్: తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



కొత్తగూడెం అర్బన్: అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- ముగ్గురు ఖమ్మం జిల్లా మంత్రులు 'భద్రాద్రి'కి అన్యాయం చేస్తున్నారు
- ఏజెన్సీ రైతులకు నీళ్లివ్వకుండా మైదాన ప్రాంతాలకు తరలించుకెళ్తున్నారు
- ఆరు గ్యారెంటీలంటూ జిల్లా ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించింది
- జిల్లాకు అన్యాయం చేసినా, హామీలు అమలు చేయకున్నా ప్రభుత్వాన్ని వదలం
- బీఆర్ఎస్ శ్రేణుల స్పష్టీకరణ.. 'రేగా' పిలుపుతో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు..

# సీతారామ జలాలను భద్రాద్రి జిల్లాకే ముందివ్వాలి

సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను భద్రాద్రి జిల్లా రైతులకే ముందుగా అందించాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక ఏజెన్సీ రైతులకు నీళ్లివ్వకుండా పొరుగు జిల్లాలకు తరలిస్తే చూస్తూ ఊరుకోబోమని, మరో ఉద్యమానికి సిద్ధమవుతాయని స్పష్టం చేశారు. సీతారామ జలాలను మొదటగా భద్రాద్రి జిల్లాకు ఇవ్వకుండా ఇతర జిల్లాలకు తరలించడాన్ని నిరసిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని పార్టీ శ్రేణులు సోమవారం కదం తొక్కాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని తహసీల్ కార్యాలయాల ఎదుట పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు కలిసి ధర్నాలు, ఆందోళనలు నిర్వహించారు. కొన్ని మండలాల్లో నిరసన ర్యాలీలు, బైక్ ర్యాలీలు చేపట్టారు. అనంతరం ఆయా మండలాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తలాపునే ఉన్న గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారని అన్నారు. భద్రాద్రి జిల్లాలోని అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద దుమ్ముగూడెం ఆనకట్టపై సీతారామ ప్రాజెక్టును, సీతమ్మ బరాజ్‌ను ప్రారంభించారని అన్నారు. సుమారు రూ.18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టును 90 శాతం నిర్మించారని గుర్తుచేశారు. ఇంతలో వచ్చిన కాంగ్రెస్ పాలకులు.. సీతారామ ప్రాజెక్టు ఫలాలు భద్రాద్రి జిల్లాకు అందకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పొరుగునే ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు సీతారామ జలాలను మొదటగా భద్రాద్రి జిల్లాకు అందించకుండా తమ జిల్లాలకు తీసుకెళ్లాలని చూస్తున్నారని విమర్శించారు. అలాగే, ఆరు గ్యారెంటీల పేరుతో భద్రాద్రి జిల్లా ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి.. 18 నెలలు దాటినా వాటి ఊసు ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. సీతారామ జలాలను మొదటగా భద్రాద్రి జిల్లాకు ఇవ్వకున్నా, ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయకున్నా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు.

–నమస్తే నెట్‌వర్క్, జూన్ 9




ఇల్లెందు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

## కేసీఆర్ పాలనలో సంబురంగా సాగు..



బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతుబంధు' పథకం కేంద్ర ప్రభుత్వంతోపాటు అనేక రాష్ట్రాలను ఆకర్షించింది. ఐక్యరాజ్య సమితి మన్ననలు కూడా పొందింది. కేసీఆర్ సీఎంగా ఉన్నన్ని రోజులు ఏటా వానకాలం, యాసంగి కలిపి రెండు సీజన్లకూ పంటల సమయానికి ముందుగానే రైతుల ఖాతాల్లో రైతుబంధు పంటల పెట్టుబడి సాయం జమ అయ్యేది. దీంతో నాడు రైతులకు పెట్టుబడి కష్టాలు తీరాయి. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే బాధలు తప్పేవి. నాడు బీఆర్ఎస్ సర్కారులో వానకాలానికి రూ.5 వేలు, యాసంగికి మరో రూ.5 వేలు కలిపి మొత్తం ఎకరానికి రూ.10 వేల చొప్పున అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అందించేవారు. దీంతో రైతులందరూ సంబురంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యేవారు. దిగుబడిని గణనీయంగా పెంచేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆ ప్రాభవం కనుమరుగైంది.

**యాసంగిలో నాలుగెకరాలకే పరిమితమైన 'రైతుభరోసా'**



పంటల పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందించకుండా కర్షకుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు ఆటలాడుతోంది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మొదలుకొని ఇప్పటి వరకూ ఈ సీజన్‌లోనూ సీజన్‌కు ముందుగా పెట్టుబడిని జమ చేసి రైతుల వ్యవసాయ అవసరాలకు అందించిన పాపానపోలేదు. దీంతో 'ఈ సీజన్‌కైనా సమయానికి అందితే బాగుండు' అనే ఆశతో ప్రతి సీజన్‌లోనూ ఖమ్మం జిల్లా అన్నదాతలు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఇటీవల ముగిసిన యాసంగిలో నాలుగెకరాల్లోపు విస్తీర్ణమున్న రైతులకు కొద్దికొద్ది మొత్తాల్లో జమ చేస్తూ ఐదారు నెలలు గడిపింది. ఖమ్మం జిల్లాలో ఇంకా 62,561 మంది రైతులకు రూ.179 కోట్లను పెండింగ్‌లో పెట్టింది. ఇక తాజాగా మొదలైన వానకాలం సీజన్‌కైనా సీజన్‌కు ముందుగా సాయాన్ని జమ చేస్తుందేమోనని ఎదురుచూస్తున్న రైతులకు మంత్రి తుమ్మల నిరాశను మిగిల్చారు. నాట్ల నాటికి జమ చేస్తామంటూ కుండ బద్దలు కొట్టారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై కర్షకులు క్రమంగా నమ్మకాన్ని కోల్పోతున్నారు.

- ఖమ్మం, జూన్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

## పంటల పెట్టుబడి

# ఈసారైనా అందేనా?

- పెండింగ్‌లో రూ.179 కోట్ల పెట్టుబడి సాయం నిధులు
- ఈ వానకాలం కోసం ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు
- నాట్లేసే సమయానికే ఇస్తామని ప్రకటించిన మంత్రి తుమ్మల
- కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయిన కర్షకులు
- ఖమ్మం జిల్లాలో మొత్తం 3,51,592 మంది రైతులు

రైతుబంధు కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తున్న రూ.10 వేల సాయం పంటల పెట్టుబడికి సరిపోదని, తాము అధికారంలోకి వస్తే రైతుభరోసా పేరిట ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీని నమ్మిన రైతులు.. ఆ పార్టీకి అవకాశం ఇచ్చి చూశారు. కానీ ఆ నాటి నుంచి నమ్మిన రైతులను నట్టేట ముంచుతూ వస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. తాను హామీ ఇచ్చినట్లుగా ఎకరానికి రూ.15 వేలు ఇవ్వకపోగా.. దానిని రూ.12 వేలకు కుదించింది. సీజన్‌కు రూ.6 వేలు ఇస్తామంటూ డాంబికాలు పలికింది. కానీ పట్టుమని ఒక్క సీజన్‌కు కూడా రైతులందరికీ ఇచ్చిన పాపానపోలేదు. చివరికి ఇటీవలి యాసంగి సాయం కూడా పూర్తిస్థాయిలో జమ చేయలేదు. 4 ఎకరాల్లోపు విస్తీర్ణమున్న రైతులకు ఈ ఏడాది జనవరి 26న యాసంగి ప్రారంభంలో మొదలు పెట్టిన యాసంగి సీజన్ సాయాన్ని ఈ ఐదారు నెలలుగా కొద్దికొద్దిగా ఇస్తూ వచ్చారు. ఈలోపు యాసంగి ముగిసింది. వానకాలం కూడా మొదలైంది. కానీ నాలుగెకరాలకు మించిన రైతులెవరికీ యాసంగి సాయం జమ కాలేదు.

### అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతి విడతలోనూ పంటల పెట్టుబడి సాయం కోసం అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీజన్ ముందే జమ అయిన పెట్టుబడి సాయం.. కాంగ్రెస్ వచ్చాక సీజన్లకు సీజన్లు ఆలస్యమవుతోంది. రైతుభరోసా ఎప్పుడొస్తుందోనని కర్షకులందరూ కళ్లలో ఒత్తులేసుకొని ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించింది. ఈ క్రమంలో నిరుటి వానకాలం సీజన్ రైతుభరోసాను పూర్తిగా ఎగ్గొట్టింది. యాసంగిలో కేవలం మూడెకరాల్లోపు విస్తీర్ణమున్న రైతులకే ఇచ్చి ఫుల్‌స్టాప్ పెట్టింది. మిగిలిన రైతులకు మొండిచేయి చూపించింది. వారి ఆశలపై నీళ్లు జల్లింది. దీంతో కాంగ్రెస్ సర్కారుపై అన్నదాతలు నమ్మకాన్ని కోల్పోయారు.

### వానకాలమైనా 'భరోసా' దక్కేనా?

ఈ వానకాలం సీజన్ 'రైతుభరోసా' సాయాన్ని నాట్ల సమయానికి రైతుల ఖాతాల్లో జమ చేస్తామంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ప్రకటించారు. దీంతో చిన్న, సన్నకారు రైతులందరూ వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని సాగు పనులు మొదలు పెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో రైతుభరోసా పథకం ఉద్దేశం నీరుగారి పోతోంది. రైతుభరోసా కింద ఇచ్చే పెట్టుబడి సాయం కోసం ఖమ్మం జిల్లాలో 3,51,592 మంది రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవలి యాసంగిలో కేవలం నాలుగు ఎకరాల్లోపు విస్తీర్ణమున్న రైతులకే రైతుభరోసా సాయం జమ అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఖమ్మం జిల్లాలో 3,51,592 మంది రైతులు ఉండగా రైతుభరోసా కింద గత యాసంగిలో వారి ఖాతాల్లో రూ.438 కోట్లు జమ చేయాల్సి ఉంది. అయితే గత యాసంగిలో 2,89,031 మంది రైతులకు రూ.259 కోట్లను మాత్రమే ప్రభుత్వం జమ చేసింది. ఇంకా 62,561 మంది రైతులకు రూ.179 కోట్లను జమ చేయాల్సి ఉంది. కానీ వానకాలం సీజన్ మొదలైనా గత యాసంగి పెట్టుబడి సాయాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. అయితే, గత యాసంగి సాయాన్ని నాలుగెకరాల్లోపు రైతులందరికీ జమ చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో వారిలో కూడా చాలా మంది రైతులకు సాయం అందనట్లు తెలుస్తోంది.



# తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ కేసీఆరే

### అట్లాంటా ప్రవాస భారతీయుల సమావేశంలో 'తాతా'

రఘునాథపాలెం, జూన్ 9: తెలంగాణకు ఎప్పటికీ బ్రాండ్ అంబాసిడర్ మాజీ సీఎం కేసీఆరే అని ఖమ్మంజిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. ప్రవాస తెలుగు కమ్యూనిటీ ఆహ్వానం మేరకు అట్లాంటా నగరంలో ప్రవాస భారతీయులతో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి తాతా మధు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న తీరు, తెలంగాణ పునర్నిర్మాణాన్ని గురించి వివరించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ దంపతులు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు.



మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు దంపతులు

# విపత్తు నిర్వహణ కార్యక్రమాలు చేపట్టాలి: ఖమ్మం కలెక్టర్



విపత్తు నిర్వహణపై సమీక్షలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం అర్బన్, జూన్ 9 : విపత్తు నిర్వహణ కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో విపత్తుల నిర్వహణపై అదనపు కలెక్టర్ పీ శ్రీనివాసరెడ్డి, సంబంధిత ఎస్డీఆర్ఎఫ్ పోలీస్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గత ఏడాది వచ్చిన భారీ వరద, తీసుకున్న చర్యలు తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. ఎప్పుడూ రానివిధంగా గత ఏడాది భారీస్థాయిలో వరద వచ్చిందని తెలిపారు. 2023లో వచ్చిన 24 అడుగులు అతి పెద్దది అనుకుంటే 2024లో 40 అడుగుల వరద వచ్చిందన్నారు. ఆ సమయంలో సామాజిక మాధ్యమాల్లో చాలా మేరకు తప్పుడు ప్రచారాలు జరిగాయన్నారు. జిల్లాలో వరద ఉధృతి అధికంగా ఉండటం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ముందుగా లేకపోవడం, ప్రజలు ముందుగా వరద ఉధృతిని ఊహించలేకపోవడం వంటి అనేక కారణాల వల్ల చాలా ఇబ్బందులు తలెత్తాయని కలెక్టర్ వివరించారు. పాత తప్పులు పునరావృతం కాకుండా ఖమ్మం జిల్లాలో వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. కొత్తగూడెం 6వ బెటాలియన్ అధికారి డీ శివప్రసాదరెడ్డి, డీఆర్వో ఏ పద్మశ్రీ, ఎస్డీఆర్ఎఫ్ బృందం అసిస్టెంట్ కమాండెంట్ డీ శ్రీనివాసరావు, ఆర్ఎస్‌లు శ్రీవాస్తవ్, శ్రీకాంత్, సురేశ్, ఆర్ఐలు జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు తెలంగాణ భవన్‌కు వెళ్దాం.. కేసీఆర్‌కు మద్దతుగా నిలుద్దాం..

### కాళేశ్వరం కమిషన్ ఎదుటకు వెళ్తున్న అధినేతకు స్థైర్యాన్నిద్దాం: రేగా కాంతారావు



మణుగూరు టౌన్, జూన్ 9: ఈ నెల 11న హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు పార్టీ అధినేత, ఉద్యమసారథి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్నందున భద్రాద్రి జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులం కలిసి తరలివెళ్దామని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 9 గంటలకే తెలంగాణ భవన్‌కు చేరుకుందామని అన్నారు. తెలంగాణ జీవధార అయిన కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తూ బీఆర్ఎస్‌ను అస్థిర పర్చేందుకు కుట్ర పన్నుతోందని అన్నారు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి, సీనియర్ నేత అయిన హరీశ్‌రావుకు, పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ ద్వారా నోటీసులు పంపిందని అన్నారు. కమిషన్ నోటీసుల మేరకు కాళేశ్వరం కమిషన్ ఎదుట ఈ నెల 11న హాజరుకానున్నందున మనమందరమూ తరలివెళ్లి ఆయనకు మద్దతుగా నిలిచి స్థైర్యాన్నిద్దామని అన్నారు.

- సర్కారు మోసంపై వెల్లువెత్తిన నిరుపేదల నిరసనలు..
- సమస్యల పరిష్కారంపై గళమెత్తిన మహిళలు..
- రైతాంగ సమస్యలపై ధ్వజమెత్తిన అన్నదాతలు..

# దద్దరిల్లిన ధర్నాలు

సర్కారు మోసాలు, సమస్యల పరిష్కారంపై సాగదీతలు, రైతాంగ సమస్యలపై పట్టింపులేని తనాలపై ఆయా వర్గాల ప్రజలు భగ్గుమన్నారు. తమ తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనబాట పట్టారు. ఈ మేరకు భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా సోమవారం ధర్నాలు నిర్వహించారు. తమ నిరసన గళాన్ని వినిపించారు. అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ తరువాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందంటూ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం, భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకో రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నందున.. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన వంట బిల్లులు, వేతనాలు, కోడి గుడ్ల బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే, అఖిల పక్ష ఐక్య రైతు సంఘం నాయకులు కూడా భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లాలోని రైతులందరికీ సరిపడా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు.

–అశ్వారావుపేట/ కొత్తగూడెం గణేశ్ టెంపుల్/ కొత్తగూడెం అర్బన్, జూన్ 9



అశ్వారావుపేట తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు




కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు




భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు